క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



కృష్ణా: మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ మేరకు.. ఆమె కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమయ్యే టార్పాలిన్లు, వేయింగ్ మిషన్స్, తేమశాతాన్ని కొలిచే మిషన్స్ సరిగ్గా ఉన్నాయా లేదా అనే విషయాన్ని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండగా చూడాలని సూచించారు. ఆమెతోపాటు ఏపీఎం బస్వరాజ్, ఐకేపీ అధికారులు, రైతులు ఉన్నారు.

ఉచిత నేత్రవైద్య శిబిరం



కోస్గి రూరల్: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచితనేత్ర వైద్యశిబిరం విజయవంతమైంది. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గురువారం నిర్వహించిన శిబిరంలో నేత్ర వైద్యుడు భాస్కర్ గౌడ్ మొత్తం 48మందికి కంటిపరీక్షలు చేశారు. వీరిలో 32మందికి కంటిలో శుక్లాలు గుర్తించారు. కంటి సమస్య ఉన్నవారికి పాలమూరు జిల్లా కేంద్రంలోని లయన్ రాంరెడ్డి కంటిఆస్పత్రిలో ఉచిత ఆపరేషన్లు చేస్తామన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పూర్ణచందర్ యాదవ్, ప్రతినిధులు బెజ్జు వెంకట్రాములు, వెన్న శేఖర్ పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం



కృష్ణా: జిల్లా కేంద్రంలో ఇటీవల పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలో ఎస్ఐ ఎండీ నవీద్ అత్యధిక పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును అందుకున్నందుకు గాను గురువారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఎస్ఐని సన్మానించారు. ఈ మేరకు.. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను ఒక్కప్పుడు క్రికెటర్‌ను కావడంతో క్రీడా స్ఫూర్తితోనే సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు బిల్డర్ తాయప్ప పాల్గొన్నారు.

పెరటికోళ్ల పంపిణీ

మాగనూర్: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మండలలోని మహిళా సంఘం సభ్యులకు ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏపీఎం వనితకుమార్ పెరటికోళ్లు పంపిణీ చేశారు. ఈ మేరకు.. ఏపీఎం వనితకుమార్ మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల్లోని 50మంది మహిళలకు ఒక్కొకరికీ 50కోళ్లు పంపిణీ చేశామన్నారు. ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏపీఎం వనితకుమార్, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు మల్లమ్మ, వెంకటమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



ధన్వాడ: జిల్లాకు నెట్‌బాల్ క్రీడలో మంచి ప్రాచుర్యం ఉందని దానిని కొనసాగించేందుకు కృషి చేయాలని జిల్లా యువజన, క్రీడల అధికారి శెట్టి వెంకటేష్ అన్నారు. గురువారం మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకులంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. నిర్మల్ జిల్లా నెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో 7వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల పోటీలలో పాల్గొనేందుకు బయలు దేరిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కొండాపూర్ గిరిజన గురకుల ప్రిన్సిపాల్ రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సాంబయ్యనాయక్, పీడీ రవికుమార్, పీఈటీ ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

నర్వ: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన విద్యార్థి శివరాం రాష్ట్రస్థాయి రెస్లింగ్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల కరస్పాండెంట్ హన్మంతురెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి అండర్ 17విభాగంలో హైదరాబాద్‌లో నిర్వహించే పోటీలలో తలపడనున్నారన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడంపై ఉపాధ్యాయులు అతడిని అభినందించారు.



ఊట్కూరులో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు



సజనాపూర్‌లో సర్వేను పర్యవేక్షిస్తున్న ఆర్ఐ

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

మరికల్: కుల గణన చేస్తున్న అధికారులు ప్రతి ఇంటి వివరాలు పూర్తిస్థాయిలో సేకరించాలని శిక్షణ కలెక్టర్ గరిమనరుల అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో సర్వే చేస్తున్న ప్రాంతాలను ఆమె పరిశీలించి అధికారులతో మాట్లాడారు. సర్వే పాదర్శకంగా ఉండేలా చూడాలన్నారు. కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, సర్వే అధికారులు పకడ్బందీగా సర్వే చేయాలని సూచించారు. నిర్ణీత సమయంలోగా సర్వే పూర్తి చేయాలన్నారు.

ఊట్కూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా సమగ్రకుటుంబ సర్వేను గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలని ప్రత్యేకాధికారి ఉమాకాంత్, తహసీల్దార్ రవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన సర్వేను వారు పరిశీలించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యూమరేటర్లు పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయగౌడ్, ఆర్ఐ వెంకటేష్, రాఘువేందర్ రెడ్డి, పవన్‌కుమార్, చరణ్ పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని వడ్వాట్, ఒబ్లాపూర్ తదితరు గ్రామాల్లో గురువారం రెండోరోజు కొనసాగి సర్వేస్టికర్స్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ రహమతుద్దీన్ పరిశీలించారు. సర్వేన 51మంది ఎన్యూమరేటర్లు సర్వే చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న కుటుంబ సర్వే గురువారం రెండో రోజు కొనసాగింది. మండలంలోని 30 గ్రామ పంచాయతీలో 112మంది ఎన్యుమరేటర్లు, 10 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొన్నారు. సర్వే పత్రాల్లో సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే అంశాలను నమోదు చేస్తున్నారు. సర్వే బృందాలను సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేస్తున్నారు.



వెంకటాపూర్‌లో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టర్ గరిమనరుల



ఒబ్లాపూర్‌లో పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ రహమతుద్దీన్

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం

దామరగిద్ద: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం ఔట్ రీచ్ వర్కర్ ఎండీ జిలానీ, బాలల సంరక్షణ అధికారి కరిష్మా అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల మహిళలు, బాలకార్మికులకు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడీడు గల 18ఏళ్ల లోపు బాల బాలికలను పనులకు తీసుకెళ్లొద్దని సూచించారు. అనంతరం బాలకార్మికుల నిర్మూలన, బాల్యవివాహాలు వంటి బాలల సంరక్షణ చట్టాలు వారి హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ బుగ్గప్ప, మైమూద్ మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నారాయణపేట టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ పోలీసులు సంతోష్, సురేష్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలో స్థానిక వీరా సావర్కర్ చౌరస్తాలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, రాష్ డ్రైవింగ్ చేసి రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రజల సహకారం అవసరమన్నారు. మైనర్లు రోడ్డుపై తిరిగితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఆంజనేయులు, వాహనదారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



బీమా చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి

నారాయణపేట రూరల్: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని జాజాపూర్ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త శ్రీకాంత్ ఇటీవల మృతి చెందడంతో, వారి కుటుంబానికి పార్టీ తరపున ప్రమాద బీమా పథకంలో మంజూరైన రూ. 2లక్షల చెక్కును గురువారం ఆయన తండ్రి రమేష్‌కు అందజేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ సభ్యత్వం కలిగిన ప్రతి కార్యకర్తకు బీమానగదు అందిస్తుందని, ఏ కార్యకర్తకు ఎలాంటి ఇబ్బంది కలిగిన బాధ్యతగా కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. వేపూరి రాములు, నాయకులు చందూలాల్, వెంకట్ రాములు గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నారాయణపేట రూరల్: పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నర్సింహులు అన్నారు. గురువారం పట్టణంలోని మినీస్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్ 14వాలీబాల్ మండల స్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ మేరకు.. మాట్లాడుతూ.. పిల్లలకు చదువుతోపాటు ఆటలు, సాంస్కృతిక అంశాలపై మక్కువ పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం పోటీలను ప్రారంభించి జిల్లా పోటీలకు బాల, బాలికల జట్లకు క్రీడాకారులను ఎంపిక చేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీడీలు రమణ, అత్తర్ పాషా, సాయినాథ్, అనంతసేన, వెంకటప్ప, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న నర్సింహులు

మహిళ అదృశ్యం : కేసునమోదు

మాగనూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ (27) అదృశ్యమైనట్లు ఏఎస్ఐ మన్నన్ తెలిపారు. వివరాలిలా... కొత్తపల్లి గ్రామానికి చెందిన బంగి శంకరప్ప భార్య, తన ముగ్గురు పిల్లలతో కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరు పట్టణానికి వలస వెళ్లారు. అక్కడే కొన్ని సంవత్సరాలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కొన్ని సమస్యల వలన కొత్తపల్లి గ్రామానికి తిరిగి వచ్చి పనులు చేసుకుంటున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచి తన భార్య కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గడ్డివాము దగ్ధం

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌కు చెందిన మ్యాతరి తాయప్పకు చెందిన గడ్డివాముకు బుధవారం అర్ధరాత్రి సమయంలో గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు నిప్పుపెట్టారని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదుమేరకు అనుమానితులపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎండీ నవీద్ తెలిపారు.

కేంద్రాల వద్దకే ధాన్యం తీసుకురావాలి



ధన్వాడ: రైతులు వరి ధాన్యాలను కొనుగోలు కేంద్రాల వద్దకే తీసుకురావాలని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి దేవదాస్ అన్నారు. గురువారం మండలంలోని గోటూర్‌లో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులు తమ పంటపొలాల వద్ద కొనుగోలు చేయాలని కోరారు. వరికొనుగోలు కేంద్రం వద్దకే రైతులు తమపంటను తీసుకురావాలని ఉన్నతఅధికారులు ఆదేశాలు ఉన్నాయని తెలిపారు.

శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాడుదాం



మక్తల్: శ్రమదోపిడికి వ్యతిరేకంగా పోరాడుదామని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం అన్నారు. గురువారం పట్టణంలోని విప్లవ యోధుడు కామ్రెడ్ వీఐ లెనిన్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మార్కెట్ యార్డులో జిల్లాస్థాయి సదస్సు నిర్వహించి మాట్లాడారు.. ప్రభుత్వం కార్మికుల చట్టాలను అమలు చేయడంలేదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎంఎల్ కార్యదర్శి బి.రాము, ఎండీ సలీం, నర్సింహ, రాము తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారంలో శ్రీ మహాలింగరాయ స్వామిజాతర ఉత్సవాలు గురువారం సాయంత్రం ముగిశాయి. రెండురోజుల పాటు సాగిన ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదలు పంచి పెట్టారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు. సాయంత్రం మహాలింగరాయ స్వామి ఆలయం నుంచి తిరిగి పల్లకి సేవ బీరప్ప ఆలయానికి చేరడంతో జాతర ఉత్సవాలు ముగిశాయి. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



పల్లకిలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

ప్రజాసేవ కోసం నిరంతర కృషి

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రెండో వార్డులోని శ్రీనగర్ కాలనీలో ప్రజలు పలు సమస్యలను మాజీ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన ఆమె వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కాగా వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో ట్రాక్టర్లతో మొరం తెప్పించి రోడ్డు చదును చేసినందుకు వార్డు ప్రజలు ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేనివట్లను పంచాయతీగానే ఉంచాలి



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మద్దూరు: రేనివట్ల గ్రామాన్ని మద్దూరు మున్సిపాలిటీలో కలుపుతారనే సమాచారం మేరకు ఆ గ్రామానికి చెందిన యువకులు, గ్రామస్తులు గురువారం రేనివట్ల పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రేనివట్ల గ్రామాన్ని మున్సిపాలిటీలో కలుపడంతో ఉపాధిహామీ పని కోల్పోవడం, ఆదాయ పరిమితి పెరిగి వివిధ సబ్సిడీ రుణాలు పొందడానికి ఇబ్బందులు ఏర్పడుతాయని ఈ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలుపడం పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. రేనివట్లను గతంలో మాదిరిగా పంచాయతీగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటప్ప, నారాయణ, గోపాల్, శంకర్, అంజి, మణెమ్మ, కృష్ణయ్య, హుజూర్, యాసిన్, గోవిందు, హన్మంతు, పకిరప్ప, మొగులప్ప పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్ కోసం అక్షర సాధన

మరికల్: విద్యార్థుల రేపటి భవిష్యత్‌కోసం తమ పాఠశాలలో అక్షరసాధన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు హెచ్ఎం జ్యోతి అన్నారు. గురువారం మండలంలోని జిన్నారం ప్రాథమికోన్నత పాఠశాలలో అక్షర సాధన రేపటి కోసం అనే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ.. ఒకటినుంచి ఎనిమిదోతరగతి వరకు చదివే విద్యార్థుల కోసం పాఠశాల సమయం ముగిసిన తర్వాత రెండు గంటలపాటు వలంటీర్స్‌తో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్‌లో పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి అనే అంశాలపై బోధన ఉంటుందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు పూనాది వేసే కార్యక్రమం అక్షర సాధన అన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, మాదవరెడ్డి, శంకర్‌గౌడ్, సుధీర్, వెంకటేష్, శివకుమార్, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీవాణి పాల్గొన్నారు.



అల్పాహారం అందజేస్తున్న దాతలతో హెచ్ఎం జ్యోతి

మహాసభలను జయప్రదం చేయండి

ఆత్మకూర్: పీపనగండ్లలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలకు కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రాజు, జిల్లా నాయకుడు బుచ్చన్న కోరారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిరంతరం ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తూ ప్రజలకు అండగా నిలబడుతున్నామన్నారు.

మున్నూరు కాపు సంక్షేమానికి కృషి

నర్వ: మున్నూరు కాపు కులస్తుల సంక్షేమానికి కృషిచేద్దామని మండల సంఘం అధ్యక్షుడు పోతిరెడ్డి హన్మంత్‌రెడ్డి అన్నారు. గురువారం కల్వాల్ గ్రామ సంఘం కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ మేరకు.. గ్రామ అధ్యక్షుడిగా మరాతీ శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బండి నారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా బండి గుండారెడ్డి, ఉపాధ్యక్షుడిగా చింతన్న, విష్ణువర్ధన్, హరీష్, సహాయ కార్యదర్శిగా అంజన్న, హన్మంతురెడ్డి, రాజారెడ్డి, మీడియా కన్వీనర్‌గా కురుమూర్తి, సలహాదారులుగా జైపాల్‌రెడ్డి, రాజు, రాంరెడ్డి, కార్యవర్గ సభ్యుడిగా చిన్నయ్య, వెంకట్ రెడ్డి, మనోహర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంజీవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆనంద్, హన్మంత్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

ఊట్కూరు: ప్రభుత్వం మాదాసి కురువలకు ఎస్సీ జాబితాలో చేర్చాలంటూ గురువారం దళిత సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ రవికి వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ–డీ గ్రూప్‌లో ఉన్న కురుమ కులానికి చెందిన వారు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగి ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేలో మాదాసి కురువ పేరుతో తప్పుడు సమాచారం అందించి దొడ్డిదారిన ఎస్సీలుగా నమోదు చేయించుకునే అవకాశం ఉందని తెలిపారు. వినతిపత్రం అందజేసిన నాయకులు తిమ్మప్ప, భరత్, రాము, నర్సింహ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ దయాకర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. సుబాష్, అనిల్‌కుమార్, మహాదేవ్, నర్సప్ప, వెంకటేష్, అశోక్, మారెప్ప పాల్గొన్నారు.

మాగనూర్: ప్రభుత్వం మాదాసి కురువలకు ఎస్సీ జాబితాలో చేర్చాలంటూ గురువారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు మహేష్, రాఘవేంద్ర, మధు, పెద్దింటి రమేష్, లక్ష్మణ్, శంకర్, వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూర్‌లో తహసీల్దార్‌కు వినతి అందిస్తున్న నాయకులు

వనపర్తికి షటిల్ సర్వీసులు నడపండి

అమరచింత: మండల కేంద్రం నుంచి వనపర్తికి ఆర్టీసీ షటిల్ బస్సు సర్వీసులను నడపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి, అమరచింత మున్సిపల్ వైస్‌చైర్మన్ జీఎస్ గోపితో కలిసి డిపో మేనేజర్ వేణుగోపాల్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన తర్వాత ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడుస్తాయని ఆశించిన ప్రజలకు నేటికీ నిరాశే మిగిలిందన్నారు. అమరచింత మున్సిపల్, మండల కేంద్రంగా ఉన్నా జిల్లా కేంద్రానికి నేరుగా బస్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఆత్మకూర్ పట్టణానికి వచ్చి వనపర్తికి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. డిపో మేనేజర్ స్పందిస్తూ బస్ సౌకర్యం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎండీ జబ్బార్

టీబీ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

గండేడ్: టీబీ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని గండేడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రంగారెడ్డిపల్లిలో టీబీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీని నియంత్రించడం సులభం అన్నారు. టీబీ సోకిన వారు సకాలంలో మందులు వాడాలన్నారు. పొగతాగడం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ క్యాంపులో 94 మంది నుంచి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆరీఫ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు ఆశన్న, సూపర్‌వైజర్ యాదమ్మ పాల్గొన్నారు.



రంగారెడ్డిపల్లిలో టీబీ శిబిరం